
# కను విప్పు చేసిన

# కన్నీళ్ళు



రచన : మాస్టర్ రవి

కంచం ముందు కూర్చున్న రాజారాం ఓసారి కంచం లోకిచూసి విచారంగా నిశ్వసించాడు. 'హుఁ' అనికూడా అనుకున్నాడు.

'ఏమిరా' అంది అతని తల్లి శారదమ్మ. అలా ఎందుకు అడిగిందో ఆమెకే తెలీదు. ఆ ఏమిటి ఏమిటో రాజారాంకి అంతకన్న తెలీదు, అని రోజూ వారికిద్దరికీ రవాజే.

'చారు' అన్నాడు కంచంలో అన్నం కాస్తా, కాస్త కలికి.

ఆమె తెచ్చిపోసింది. రెండు పిడికిళ్ళు తిని...... 'ఇంకేంవుంది......మజ్జిగ పోసెయ్......' అన్నాడు. ఆమాటలు కాస్త గాద్గదికంగా వెలువడ్డాయ్.

'మరి కాస్త చారే కలుపుకోరా......' అంది ఆమె.

'ఐతే......ఇవాళ కూడ......' మరి ఏమీ మాట్లాడలేక పోయాడు రాజారాం.

ఆమె తిరిగి చారే పోసింది. కలుపుకుంటున్న ఆ కంచంలో అతని కళ్ళనుండి రెండు కన్నీటి బిందువులు రాలడం ఆమె స్పష్టంగా చూసింది.

ఆమె హృదయం ఎంతగా క్షోభించిందో ఏమోగాని 'ఇంకా ఎన్నాళ్ళీ బ్రతుకోగాని ఆ భగవంతుడికి ఈ నాటికీ మనపై దయకలగలేదు......' అంది తానూ కళ్ళొతుడుచుకుంటూ. మిగతా అన్నం మరి తినకుండ (బహుశః తినలేక) అలాగే లేచిపోయాడు రాజారాం.

తైల సంస్కారంలేని తలతో, మాసికలతోవున్న అతని చెల్లెలు సీత నిరాశగా ఎదురై, ఒకసారి అతని కళ్ళల్లోకి జాలిగా చూసి, తల్లివద్దకు నడిచింది.

ఆమె చూసిన ఆ చూపుకు రాజారాం తట్టుకోలేక పోయాడు.

'భగవాన్......నేనేం పాపం చేశానని, నన్నింత క్రూరంగా శిక్షిస్తున్నావ్......అంత నిష్కృతేలేని మహా పాపమే నేను చేసివుంటే, ఇలా చిత్రహింస చేసే బదులు ఒకేసారి అంతమొందించకూడదూ? నేటికి మూడు నెలలనుండి, కాళ్ళు అరిగేటట్టుగా ఎక్కని ఆఫీసు గుమ్మంలేదు. ఎక్కడికెళ్ళినా ఒకటే జవాబు ''......నో వేకన్సీ......'

ఇంకొన్ని చోట్ల అతివిచిత్రమైన సంభాషణలు జరిగాయ్__

'ఎవరిదేనా రికమెండేషన్ తీసుకువచ్చారా?...... అదేంవిటి ఇంత విశాలమైన జిల్లాలో మీకు ఎవరూ తెలీదా?...... లాభంలేదండీ......'అంటూ పెదవి విరచేవారు కొందరైతే__, 'ఏమాత్రం మమ్మల్ని సంతోష పరచగలరు......మంచి వుద్యోగం...... నెలకు ఎనభై......చూసుకోండి...... ఒకే ఒక్క ఖాళీవుంది...ఆలశ్యంచేస్తే అది వుండదు...' అని ఆశ చూపేవారు మరికొందరు.

తాను దానికీ, దీనికీ__దేనికీ పనికిరానివాడు. శక్తి హీనుడు. తనకీ ఒక రికమెండేషన్ ఇచ్చేవ్యక్తి వుంటే

ఏనాడో తానూ ఒక ఉద్యోగి అయివుండేవాడు. ఈ నాడీ దేబిరింపేల?

వాళ్ళని సంతోషపరచగల శక్తి తనకుంటే, కనీసం తనింట్లో ఏ ఒక్కరేనా, ఒక్క రోజేనా తృప్తిగా భోంచేసి వుండేవారు.

మీటింగులు జరుగుతూనే వున్నాయ్. ప్రతిపాదనలు, ప్రతివాదనలు అవుతూనే వున్నాయ్. కొత్త చట్టాలు, కొత్త నాయకులు వస్తూనే వున్నారు. గానీ...పరిస్థితిలో మాత్రం ఏమాత్రం మెరుగు కనబడ్డంలేదు. అంతా పాతధోరణే.

పూట గడిస్తే పండగలా వుండే ఈ పరిస్థితుల్లో చెల్లెలు ఎదిగి వివాహానికిసిద్ధమైంది. కనీసం ఆ ఆలోచన, ఆ ఊహ అయినా తన తలలోనికి రానివ్వగలడా?

ఇంటికివస్తే 'ఏమిటిలేదని' అమ్మచెప్తుతుందో అని బెంగ. వంటరిగా కూర్చుంటే చెల్లెలి జాలికళ్ళు ఎక్కడ తన అణువణువూ చీల్చి చెండాడుతాయో అని బెంగ...పోనీ ఈ బాధ భరించలేక వీధిలోకి పోదామంటే ఏమూలనుంచి ఏ అప్పులవాడు విరుచుకు పడతాడో అని బెంగ.

అనుక్షణం ఇలా బెంగలతో కృంగిపోతూ జీవించేకంటే...తాను ఏ ఆత్మహత్యో చేసుకుంటే......ఏం చేసుకుంటే...తప్పా?

ఈనైరాశ్యపు బ్రతుకుకంటే ఆ శాశ్వతత్వమే నయం-అని ఓ నాడు తాను తెగించి, రైలు పట్టాలదగ్గరకు వెళ్ళినపుడు 'బాబూ...చచ్చి ఏం సాధిస్తావ్. ఇంత చదువూ, ఇంత విజ్ఞానం ఇవన్నీ ఇలా నేలపాలు చెయ్యడానికా...?నీవు పోతే మాగతేం కాను? బిచ్చగత్తెల్లా వీధులెంట తిరగాల్సిందేనా ? ఈ మాత్రంగానైనా జీవిస్తున్నామంటే నీకోసమే గదట్రా...మమ్మల్నిలా అన్యాయం చేస్తావా?...కష్టాలుకలకాలం వుండవు. ఏనాడో ఓనాడు ఆభగవంతుని కరుణ మన మీద కలక్కపోదు...తప్పకుండా నీకు త్వరలో మంచి ఉద్యోగం వస్తుంది ... మాకోసం ... ... మాకోసం ఆగు బాబూ ... ... అఘాయిత్యం చెయ్యకు......' అని అమ్మ అనినట్టూ...'అన్నయ్యా...ఇలాగేనా మేం బ్రతకకుండా అడుక్కు తినమనా నీ ఉద్దేశం...నీ అండన ఎంతో ఆశకూడ దీసికుంటూ రోజులు వెళ మారుస్తూన్నాం...పరిస్థితులు ఎప్పుడూ ఇలాగేవుండిపోవు...మనకీ మంచిరోజులు వస్తాయ్...వద్దు అన్నయ్యా...వద్దు...' అని చెల్లి సీత దీనంగా బ్రతిమాలినట్టూ వినిపించింది.

నిజమే...తానంటే ఈ రైలు క్రింద ఆత్మహత్య చేసుకుంటాడు. గానీ...'తనని నవమాసాలూ మోసి కనిపెంచి ఇంతవాణ్ణి చేసి ఎన్నెన్నో భవిష్యత్ కలలతో ఎదురుచూసే తల్లి., తనే సర్వస్వమని., తనవల్లే తన జీవితమొక గమ్యం చేరగలదని ఆశించే చెల్లి... రేపు...రేపు ఇంటింటికీ వెళ్ళి అడుక్కుం......'ఇక ఆలోచించలేకపోయాడు.

వెంటనే వెనుదిరిగాడు. రైలు శరవేగంతో పెద్దగా శబ్దంచేసుకుంటూ పట్టాలమీంచి దూసుకుపోయింది.

వాతావరణం తిరిగీ నిశ్శబ్దమైంది.

నిర్మలమైన ఆకాశం...అలనల్లన చెట్లు దూరంగా పచ్చని పొలాలు—స్వేచ్ఛగా ఇటూ-అటూ తిరిగే పేరు తెలియని అనేక పక్షులు...

ఎందుకో తృప్తిగా నిట్టూర్చి తానానాడు వెనుతిరిగాడు. 'ఏనాటికేనా అదృష్టం తనని వరించదా—' అనే ఆశతో...గానీ...నేటివరకూ జరిగిన కథేమిటి ? ఇంకా ఏమాశించి ఈ బ్రతుకు సాగనివ్వాలి ?

ఈ రోజు మాత్రం ఏమైంది?

ఉద్యోగం కోసం అడిగినపుడు ఆ ఆఫీసరు ఎంత నిర్లక్ష్యంగా నవ్వాడు! ఏదుటిమనిషి 'పురుగుకన్నా హీనం' అన్నట్టుగా వుంది ఆనవ్వు.

'ఉద్యోగం కావాలా...సంతోషం ... ఈరోజుల్లో ఉద్యోగం అక్కర్లేని దెవరికయ్యా...మరొకటి...ఇంటర్వ్యూకి వచ్చిన కొంతమంది సినిమా డైలాగ్స్ కూడ వల్లెవేస్తున్నారయ్యా...' మీరు గాని నాపై దయచూపకపోతే ఇక నేను మరి ఇంటికి వెళ్ళలేను సార్...ఇంతటితో నా జీవితమే సరి! ఆశగా ఎదురు చూసే అమ్మకు; జాలిగా ఏదో ఆశించే చెల్లికి—నేనేం సమాధానం చెప్పేది?—నేను రోజూ చెప్పే సమాధానానికి వారు అలవాటుపడిపోయారు. ఏనాటికైనా శుభవార్త తీసికువస్తానేమో—అని చూస్తూంటారు.

అప్పులవారికి జవాబులు చెప్పుకోలేక, కనిపించని

అదృష్టంకోసం వేచి...మరి...వుండలేను... నాపై మీరు కటాక్షించాలి...' అని.

'నీ జాలి కథకూడా కథలాగే వుంది...ఉద్యోగం దొరక్క కొన్ని చోట్ల గ్రాడ్యుయేట్లు కూడా కాఫీ హోటల్స్‌లో సర్వర్స్‌గా వుంటున్నారని; మరికొన్ని చోట్ల రిక్షాలు కూడ లాగి జీవిస్తున్నారని—నీకు—తెలీదూ... ఐయామ్ సారీ... మీరు వెళ్ళొచ్చు...' అన్నాడా ఆఫీసర్.

తన కళ్ళల్లో నీళ్ళు తిరిగాయ్...జీవనోపాదికి తడు మార్గాలు చెప్తున్నాడా? ... ఇంకానయం ... రాత్రి డ్యూటీలమీద తిరిగి మరికొందరు జీవిస్తున్నారని చెప్ప లేదు...


దాదాపు పది ఖాళీలున్న ఈ ఆఫీసులోనే దొరక్క పోతే ఇక తనకు భవిష్యదాశ కనుచూపు మేరలో కన బడనట్టే...

కళ్ళు తుడుచుకుంటూ—'సార్ ... మీరేలాగైనా నన్ను నిలబెట్టాలి సార్..., లేకపోతే...... ఉప్పె న్నగా వచ్చిన దుఃఖాన్ని; వెల్లువగా వచ్చే కన్నీటి ధారలను అణచి పెట్టుకోలేక పోయాడు గానీ... గానీ......

అతని హృదయం ద్రవించలేదు...... సరికదా ... 'మిష్టర్...ఇదేం డ్రామాగాని; సినిమా సెట్‌గాని కాదు...దయిచేసి నన్ను పవిచేసికోనీ...' అంటూ బెల్ కొట్టాడు,

తన తల తీసేసినట్లయింది...ఇక చావుకన్నా వేరే గత్యంతరం లేదని మరోసారి ఋజువైంది.

ఆఫీసర్ వైపు తిరిగి—'థేంక్యూసార్ ...ఇపుడే కాదు ...ఇంకెపుడూరాను. ఇక్కడికే కాదు... ఇంకెక్కడికీ కూడా...' అంటూ తాను చరచరా ముందుకు నడి చాడు.

తృప్తిపడ్డాడు రాజు!!

మీద ఫేన్ గిరగరా తిరుగుతోంది. నీలం బబ్బు మత్తుగా వెలుగుతోంది. కిటికీలోంచి వచ్చేగాలి నైట్ క్వీన్ వాసనను హుషారుగా మోసుకొస్తోంది.

గడియారం వంకచూస్తే రాత్రి ఏడు దాటుతోంది. మీద ఫేను తిరుగుతున్నా; కిటికీ గుండా సుమసువాసనలతో గాలి లోనికి హాయిగా వస్తున్నా—రాజు శరీరం చెమటతో పూర్తిగా తడిసిపోవడం గమనించి ఆశ్చర్యపోయాడు. శరీరం చాలా నీరశించింది. గుండె దడ దడ కొట్టుకుంటోంది. పక్కవున్న మంచినీళ్ళు కాస్త తాగి; లైట్ ఆన్ చేశాడు.

గదిలో వెన్నెల ప్రసరించినట్టుగా వుంది. సిగరెట్టు వెలిగించి, రెండు దమ్ములు లాగేవరకూ అతని మనసు కుదుటబడలేదు. రాజు పూర్తి పేరు కృష్ణంరాజు. అతను ఒక ఫర్మ్‌కి చీఫ్ ఆఫీసర్.

జరిగినదాన్ని తిరిగి స్మృతిలోకి తెచ్చుకుంటే అతని హృదయం కలవరపడసాగింది. కంచంలోపడ్డ కన్నీళ్ళు, తల్లి ఆశాభావం, చెల్లి జాలి దృక్కులు, రాజారాం వేదన...ఇవన్నీ ఆఫీసర్ రాజుకు అలజడి కలగజేశాయ్.

వచ్చివెళ్ళిన రాజారాం జీవితం ఇంత దుస్థితిలో వుందా?

పుట్టిననాటినుండి నేటివరకూ దారిద్ర్యం, ఆకలి, బాధ్యత అప్పులు ఇత్యాది పేర్లే వినని ఆఫీసర్ రాజు అవన్నీ చవి చూశాడు.

'పాపం...ఇదా రాజారాం చరిత్ర! ఆకలి ఆర్తనాదాలు సినిమా డైలాగుల క్రింద జమకట్టి, అతడిని ఎంతటి బాధకు గురిచేశాను! దేనికేనా అనుభవంవుండాలి, లేకపోతే లోకజ్ఞానమేనా వుండాలి. ఈ విషయంలో ఈ రెండున్నూ లేవు తనకు. రాజారాం కన్నీళ్లు చూసి హేళనచేసిన తనకు నిష్కృతిలేదు. ఫలానా మినిష్టర్ గారి రికమెండేషన్‌తో అయిదు సీట్లు, తమ జేబులు నింపిన వారికి మరొక అయిదు సీట్లు రిజర్వు చేసిన తనవంటివారిని భగవంతుడు కూడా క్షమించడు.

'ఏర్ కండిషన్డ్ గదుల్లో, సోఫాల మీద కూర్చుని ఆర్డర్లు జారీచేసే తనవంటివారికి, రాజారాం వంటివారి చరిత్రలు కేవలం కథల్లాగే కనిపించవచ్చు. గానీ, లోకంలో రాజారాంవంటివారే ఎక్కువనేది సత్యం—అతని కన్నీళ్ళు నా కనువిప్పు చేశాయ్—' అనుకుంటూ ఆఫీసర్ రాజులేచి, ప్యూన్‌ని పిలిచాడు. దూరంలో వెళ్తున్న వ్యక్తిని పిలవమన్నాడు.

ప్యూన్ రాజారాంని పిలుచుకుని వచ్చాడు.

అవమానించిన దానికి క్షమించమని రాజారాంను వేడుకున్నాడు రాజా. వెంటనే నూటయాభై రూపాయి జీతానికి ఆర్డరిచ్చాడు. ఈ రోజైనా మీ తల్లికీ—చెల్లికీ శుభవార్త వెళ్ళి చెప్పమన్నాడు రాజు. రాజారాంకు అంతా కలగా వుంది. అదృష్టం అవరించింది అంతే!!

పండిత డి.గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
Diamond Jubilee
1898 1958
ఆయుర్వేదాశ్రమం(ప్రైవేట్)లిమిటెడ్,
మదరాసు-17.